


ఆహ్లాదం... ఆందోళనకరం

ప్యారానగర్ డంపింగ్‌యార్డ్ ఏర్పాటుతో నర్సాపూర్ కాలుష్యమయం అవుతుందని ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు 8లో ▸



డెత్ స్పాట్‌గా...

జిల్లాలో మహబూబ్‌సాగర్ చెరువు అధికారుల పర్యవేక్షణ లోపంతో ఆత్మహత్యల కేంద్రంగా మారింది. వివరాలు 9లో ▸



న్యూస్‌రీల్

1న ప్రత్యేక ఓటరు నమోదు

పటాన్‌చెరు టౌన్: ఏప్రిల్ 1న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు నమోదు చేసుకోవాలని ఓటరు నమోదు అధికారి దేవూజ పేర్కొన్నారు. పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవూజ మాట్లాడుతూ...18 ఏళ్లు నిండిన నూతన ఓటర్లు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు, తప్పుల సవరణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ తహసీల్దార్‌లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'పది' పరీక్షలు

రాష్ట్ర టెన్త్ ఎగ్జామ్స్ అబ్జర్వర్ ఉషారాణి



హత్నూర మండలం దౌల్తాబాద్ పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఉషారాణి

హత్నూర (సంగారెడ్డి): పదోతరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర పదో తరగతి పరీక్షల అబ్జర్వర్ ఉషారాణి పేర్కొన్నారు. గురువారం హత్నూర మండలం దౌల్తాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అభిజ్ఞ పాఠశాల పరీక్ష కేంద్రాలను ఆమె పరిశీలించారు.

నేడు డంపింగ్‌యార్డ్‌పై ప్రజా బ్యాలెట్



బ్యాలెట్ పేపర్‌ను విడుదల చేస్తున్న జేఏసీ నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలు 44వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జేఏసీ ఆధ్వర్యంలో ప్రజా బ్యాలెట్ ఏర్పాటు చేయనున్నట్లు జేఏసీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా బ్యాలెట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఓటింగ్ ప్రక్రియలో మండల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

● ఘనంగా లక్ష దీపోత్సవం

సంగారెడ్డి మండలంలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేట దుర్గా భవానీ ఆలయంలో 24వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఘనంగా లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయం చుట్టూ లక్ష దీపాలను వెలిగించారు. -సంగారెడ్డి టౌన్



నేడు, రేపు వర్షాలు

సంగారెడ్డి జోన్: జిల్లాలో శుక్ర, శనివారాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశముంది. ఈ మేరకు ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం గురువారం బులెటిన్ విడుదల చేసింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో కూడిన గాలులు వీచే అవకాశమున్నట్లు పేర్కొంది. పోసిన పంటలు సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.

రూ.543 కోట్లు.. 165 యూనిట్లు


ఏడాదిలో జిల్లాకు వచ్చిన పెట్టుబడులు.. పరిశ్రమలివి

- రాష్ట్రంలోనే రెండో స్థానంలో సంగారెడ్డి జిల్లా..
- టీజీ-ఐపాస్ కింద వీటికి లైసెన్సులు జారీ
- అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సామాజిక, ఆర్థిక సర్వే నివేదికలో వెల్లడి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పరిశ్రమల ఖిల్లాగా పేరున్న సంగారెడ్డి జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం 2024–25లో కొత్తగా రూ.543.42 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఈ మేరకు 165 కొత్త పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు జిల్లాలో కొలువుదీరాయి. తద్వారా 5,109 మందికి కొత్తగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగినట్లు రాష్ట్ర ప్రభుత్వం లెక్కలు తేల్చింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సామాజిక, ఆర్థిక (సోషియో ఎకనమిక్ అవుట్‌లుక్) సర్వేను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం బడ్జెట్ సందర్భంగా అసెంబ్లీకి నివేదించింది. ఈ నివేదిక ప్రకారం పరిశ్రమల స్థాపనలో సంగారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. మొదటి స్థానంలో నిలిచిన మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో 262 పరిశ్రమలు రాగా, మూడో స్థానానికి పరిమితమైన రంగారెడ్డి జిల్లాలో 130 పరిశ్రమలు వచ్చినట్లు తేలింది. ఈ పరిశ్రమల స్థాపన విషయంలో రంగారెడ్డి జిల్లాను వెనక్కి నెట్టిన సంగారెడ్డి ... రాష్ట్రంలో రెండో స్థానానికి ఎగబాకడం గమనార్హం.

టీజీ–ఐపాస్ కింద లైసెన్సులు మంజూరు..

పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం టీజీ–ఐపాస్ పాలసీని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పాలసీతో కొత్తగా ఏర్పాటు చేసే పరిశ్రమలకు సింగిల్ విండో విధానం ద్వారా లైసెన్సులు మంజూరు చేస్తోంది. సెల్ఫ్ సర్టిఫికేషన్‌తో దరఖాస్తు చేసుకుంటే పరిశ్రమల ఏర్పాటుకు రెండు వారాల్లో అనుమతులు మంజూరు చేస్తున్న విషయం తెలిసిందే. పరిశ్రమలను ఏర్పాటు చేసే పెట్టుబడిదారులు ఆయా ప్రభుత్వ శాఖల చుట్టూ తిరిగే అవసరం లేకుండా సింగిల్ విండో విధానంలో ఆయా పరిశ్రమలకు అవసరమైన అనుమతులన్నీ మంజూరు చేస్తారు. సాధారణంగా ఒక పరిశ్రమ ఏర్పాటు చేయాలంటే సుమారు 20కి పైగా ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు పొందాలి. ప్రధానంగా కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ), టీఎస్ఐఐసీ, హెచ్ఎండీఏ/డీటీసీపీ, రెవెన్యూ, జీఎస్టీ, ట్రాన్స్‌కో, ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్..ఇలా సుమారు 20కి పైగా శాఖల నుంచి అనుమతులు అవసరం ఉంటాయి. పరిశ్రమలు ఏర్పాటు చేసేవారు ఈ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే ఆన్‌లైన్‌లో టీజీ–ఐపాస్‌లో ఒక్క దరఖాస్తు చేసుకుంటే సంబంధితశాఖల నుంచి అనుమతులు మంజూరు చేసేలా ఈ విధానాన్ని అమలు చేస్తోంది. ఇలా ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 165 పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య సంస్థలకు లైసెన్సులు ఇచ్చారు.



ఉద్యోగాల్లో రాష్ట్రంలో నం.1

పరిశ్రమల (మాన్యుఫ్యాక్చరింగ్ సెక్టార్‌లో) ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్న జిల్లాలో సంగారెడ్డి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. జిల్లాలో 1.46 లక్షల మంది పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నట్లు సోషియో ఎకనమిక్ అవుట్‌లుక్ 2024–25 నివేదిక తేల్చింది. 1.24 లక్షలతో మేడ్చల్–మల్కాజ్‌గిరి రెండో స్థానంలో ఉంది. జిల్లాలో ప్రధానంగా ఫార్మా, కెమికల్, బల్క్‌డ్రగ్ వంటి భారీ పరిశ్రమలున్నాయి. అలాగే చక్కెర, జిన్నింగ్ వంటి వ్యవసాయ ఆధారిత భారీ పరిశ్రమలు జిల్లాకు వచ్చాయి. మరోవైపు ఇంజనీరింగ్ పరిశ్రమలు కూడా జిల్లాలో కొలువుదీరాయి. తద్వారా పారిశ్రామికంగా జిల్లా మరింత ప్రగతి సాధిస్తోంది.

స్థానికేతరులకే కీలక ఉద్యోగ అవకాశాలు

పరిశ్రమలతో వస్తున్న కాలుష్యం వంటి ప్రతికూల పరిస్థితులతో స్థానికులు నష్టపోతుండగా, ఈ పరిశ్రమల ద్వారా వస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మాత్రం స్థానికేతరులకే ఎక్కువగా దక్కుతున్నాయి. అన్‌స్కిల్డ్ పేరుతో ఉన్నత ఉద్యోగాలకు పరిశ్రమ యాజమాన్యాలు స్థానికులను తీసుకోవడం లేదు. ఈ విషయంలో ప్రభుత్వం స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి స్కిల్డ్ ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

విద్యార్థులకు విజయోస్తు...

నేటి నుంచి 'పది' పరీక్షలు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం అధికారులు అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశారు. జిల్లాలో 22,423 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9:30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12:30 నిమిషాల వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులు చివరి సమయంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 8:30 నిమిషాల నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రాలలోకి అనుమతించనున్నారు.

ఎలాంటి ఒత్తిడి వద్దు..

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఆందోళన, ఒత్తిడికి గురి కాకుండా ఉండాలి. పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ముందుగా విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి. పరీక్ష రాసేందుకు వెళ్తున్న సమయంలో ఒత్తిడి, మానసిక ఆందోళన అనేవి అత్యంత సహజమైనవేనని, వీటిని ప్రశాంతతతో, చిరునవ్వుతో, ఆత్మవిశ్వాసంతో జయించాలి. మీ బలాలను మాత్రమే పరీక్ష కేంద్రంలోకి తీసుకెళ్లాలి. గత సంవత్సర కాలంగా ఎంతో కష్టపడి విద్యను అభ్యసించి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులందరికీ 'సాక్షి'తరఫున 'ఆల్ ది బెస్ట్'.

డ్రోన్ శిక్షణతో మహిళలకు స్వావలంబన

కలెక్టర్ వల్లూరు క్రాంతి

జోగిపేట(అందోల్)/సంగారెడ్డి జోన్: డ్రోన్ శిక్షణతో మహిళలకు ఆర్థిక స్వావలంబన కలుగుతుందని కలెక్టర్ క్రాంతి పేర్కొన్నారు. జోగిపేటలోని ఐకేపీ కార్యాలయంలో గురువారం డీఆర్‌డీఏ, సెర్ప్, హెట్రో ఆధ్వర్యంలో స్త్రీ శక్తి గ్రూపులకు నిర్వహించిన డ్రోన్ శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎకరం పొలంలో కేవలం పదిలీటర్ల నీటితో పది నిమిషాల్లోనే మందు పిచికారీ చేయవచ్చన్నారు. డ్రోన్ ద్వారా పిచికారీ చేస్తే రోజుకు రూ.400 నుంచి రూ.500 వరకు వస్తుందన్నారు. రహదారులపై ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను కొత్తగా బ్లాక్ స్పాట్లు గుర్తించి, ప్రమాదాలకు కారణమవుతున్న అంశాలను గుర్తించాలని సూచించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

అనంతరం ఓటర్ నమోదు, బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

నాణ్యమైన అద్దాలు పంపిణీ

సంగారెడ్డి శాంతినగర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ గురుకుల బాలికల పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం కింద దృష్టి లోపం ఉన్న పిల్లలకు కళ్లద్దాల పంపిణీ చేశారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: అర్హులుగా ఉన్న లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్పష్టం చేశారు. మనూరు మండలం దుదగొండలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. గట్టులింగంపల్లి గ్రామంలో నూతన బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన, తుమ్నూర్ నుంచి బాదల్‌గాం వరకు రూ.8 లక్షలతో ఫార్మేషన్ రోడ్డు, నాగల్‌గిద్ద మండలం కరస్‌గుత్తి గ్రామంలోని ఎస్టీ గురుకులంలో మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించారు. ఖేడ్ క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ పథకం చెక్కులను పంపిణీ చేశారు.

ఎక్కడి చెత్త అక్కడే

జహీరాబాద్ మున్సిపాలిటీలో సమస్యలు కోకొల్లలు

- డంపింగ్‌యార్డులో పేరుకుపోతున్న చెత్త
- రెగ్యులర్‌గా సాగని పారిశుద్ధ్య పనులు
- వేధిస్తోన్న సిబ్బంది కొరత
- నిర్వహణ లేని పార్కులు
- రహదారిని ఆక్రమించి ఫుట్‌పాత్ వ్యాపారాలు
- 'సాక్షి' విజిట్‌లో వెలుగుచూసిన వాస్తవాలు

దశాబ్దకాలంగా పాలకమండలి లేకపోవడంతో జహీరాబాద్ మున్సిపాలిటీ అనేక సమస్యల కూపంగా మారింది. ఏళ్ల తరబడి ప్రత్యేక పాలనలోనే మగ్గిపోతోన్న ఈ మున్సిపాలిటీలో తగిన సిబ్బంది లేకపోవడంతో పూర్తిగా పారిశుద్ధ్యం లోపించింది. పేరుకు మాత్రమే పెద్దదిగా చలామణీ అవుతున్న ఈ మున్సిపాలిటీని సమస్యలు కూడా అంతే స్థాయిలో వేధిస్తున్నాయి. ట్రాఫిక్ రద్దీ, నిర్వహణ లేని పార్కులు, పూడిక తీతలు లేకపోవడంతో రోడ్లపైకి వస్తున్న మురుగునీరు, చెత్తతో పేరుకుపోతున్న డంపింగ్‌యార్డ్ వంటి సమస్యలు స్థానికులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి.

సాక్షి పరిశీలన

జహీరాబాద్: జహీరాబాద్‌ను ఇటీవల స్మార్ట్ సిటీగా ప్రకటించారు. అయినా ఇప్పటికీ కార్యరూపం దాల్చ లేదు. పదేళ్ల క్రితం నిమ్జ్ ప్రాజెక్టును ప్రకటించారు. దీంతో పట్టణం రోజు రోజుకు విస్తరిస్తోంది. అందుకనుగుణంగా అభివృద్ధికి నోచుకోలేకపోతోంది. కనీస సదుపాయాలు లేక ప్రజలు సతమతమవుతున్నారు. నగర పంచాయతీ నుంచి గ్రేడ్–3గా ఏర్పాటైంది. మున్సిపాలిటీలో ఐదు గ్రామాలను విలీనం చేసి పట్టణాన్ని విస్తరించినా అందుకు తగిన సిబ్బంది లేకపోవడంతో ఈ మున్సిపాలిటీ అస్తవ్యస్తంగా తయారైంది.

స్తంభించిన డ్రైనేజీ



మూసానగర్ కాలనీలో స్తంభించిన మురికినీరు

మున్సిపాలిటీలో సుమారు 250మంది కార్మికుల అవసరం ఉంది. ఔట్ సోర్సింగ్ కింద 149 మంది, రెగ్యులర్ కార్మికులు 26 మంది పని చేస్తున్నారు. దీంతో కాలనీల్లో వారానికి ఒక రోజు మాత్రమే పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. డ్రైనేజీ పలు ప్రాంతాల్లో రోడ్లపైనే పారుతుండటంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. శాంతినగర్, ఆర్యనగర్, రాచన్నపేట, హౌసింగ్‌బోర్డు, హమాలీ కాలనీ, ఫయాజ్‌నగర్, గడి, గడి హరిజనవాడ, ఎన్‌జీఓకాలనీ, మూసానగర్, వసంత్‌విహార్, చెన్నారెడ్డి కాలనీ, మాణిక్‌ప్రభువీధి, వసుంధర, మహీంద్రకాలనీలతోపాటు తదితర కాలనీలలో సమస్యలు నెలకొన్నాయి. అనేకప్రాంతాల్లో పక్కా డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. పలు కాలనీల్లో పందుల సంచారం సైతం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోంది. ప్రధాన వరద కాలువలను ఏడాదికి ఒకమారు మాత్రమే క్లీన్ చేస్తున్నారు.

దోమల స్వైరవిహారం

ఓపెన్ డ్రైనేజీ వల్ల పట్టణంలో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. డ్రైనేజీ నీరు ఎక్కడికక్కడే స్తంభించడం, రోడ్లపై ప్రవహించడం వల్ల దోమలు అధికంగా వృద్ధి చెందుతున్నాయి. రెగ్యులర్‌గా ఫాగింగ్ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్లపైనే సంతలు

సంతలు నిర్వహించేందుకు వీలుగా ప్రభుత్వ స్థలాలను కేటాయించకపోవడంతో రైతులు, వ్యాపారులు మాణిక్‌ప్రభువీధి, హౌసింగ్‌బోర్డు, సాయినగర్, గడి ప్రాంతాల్లో వారాంతపు సంతలు రోడ్లపైనే నిర్వహిస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణ



రహదారిపైనే నిర్వహిస్తున్న వ్యాపారాలు

జహీరాబాద్ పట్టణం 65వ జాతీయ రహదారిపై ఉంది. బైపాస్ రోడ్డు నిర్మించినా పాత రహదారిపై ట్రాఫిక్ బాగా పెరిగింది. ఈ రహదారిని సగం మేర ఆక్రమించి ఫుట్‌పాత్ వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తీరడం లేదు. వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో పాదచారులు రోడ్డుపై నడవలేని పరిస్థితి నెలకొంది. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పట్టణ ప్రజలు వాపోతున్నారు.



హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలో మురికి కాలువలో మురికినీరు, చెత్త

డంప్‌యార్డ్‌లోనూ..



ప్రధాన రహదారిపై మాత్రం రోజువారీగా ఊడ్చడం, చెత్త తొలగించే పనులు చేపడుతున్నారు. మున్సిపల్ పరిధిలో రోజుకు 55 టన్నుల మేర చెత్త లభ్యమవుతోంది. ఈ చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. నిత్యం 10 టన్నుల పొడి చెత్తను మాత్రం రీసైక్లింగ్ చేసి ఎరువు తయారు చేస్తున్నారు. మిగతా చెత్తను అలాగే వదిలేస్తుండటంతో డంపింగ్‌యార్డులో పేరుకుపోతోంది. దీంతో ప్రజలు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు.

మున్సిపాలిటీ స్వరూపం

మున్సిపాలిటీ ఏర్పడిన సంవత్సరం:	1953
విస్తీర్ణం:	67.58 చ.కి.
జనాభా:	90,050
వార్డులు:	37
రెవెన్యూ జోన్‌లు:	05
పట్టణంలో ఇళ్లు:	19,372
మంచినీటి పథకాలు:	మిషన్‌భగీరథ
అవసరమైన తాగునీరు:	8.5 ఎంఎల్‌డీ
నీటిసరఫరా బోర్లు:	470
చెత్తసేకరణ వాహనాలు:	52
పబ్లిక్ టాయ్‌లెట్లు:	86 షీట్స్
బస్తీ దవాఖానాలు:	02
స్వయం సహాయక సంఘాలు:	1,448
వీధి వ్యాపారులు:	5,200
పార్కులు:	05
ప్రతినిత్యం పనిచేసే కార్మికులు:	175

పార్కులు అధ్వానం

పట్టణంలోని పార్కులన్నీ అధ్వానంగా మారాయి. దీంతో చిన్నారులు, మహిళలు పార్కులవైపు కన్నెత్తి చూడటం లేదు.

ఓపెన్ జిమ్ నిరుపయోగం



పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ రెండేళ్లుగా నిరుపయోగంగా మారింది. పరికరాలను మరమ్మతు చేయించకపోవడంతో చిన్నారులు ఉపయోగించుకోలేకపోతున్నారు.



ఎన్‌జీఓ కాలనీలో ఓపెన్‌ప్లాట్‌లో పేరుకుపోయిన చెత్త

చెత్త వెంటనే ఎత్తడం లేదు

డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయడం లేదు. ఒకవేళ చేసినా చెత్త వెంటనే ఎత్తడం లేదు. హౌసింగ్‌బోర్డు కాలనీ ఏర్పడి నాలుగు దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ పక్కారోడ్డు, డ్రైనేజీ కాలువలు లేవు. ప్రధాన రహదారులను ఊడ్చుతున్నా అంతర్గత రోడ్లను అప్పుడప్పుడు మాత్రమే ఊడుస్తున్నారు.

-నల్ల నర్సింహారెడ్డి, హౌసింగ్‌బోర్డు కాలనీ, జహీరాబాద్

డ్రైనేజీ సమస్య తీరడం లేదు



మా కాలనీకి అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఉంది. కాలనీ నుంచి వచ్చే మురికి నీటిని అందులో కలపడం లేదు. దీంతో మురికి నీరంతా రోడ్లపైకే వచ్చి ఇబ్బందులు పడుతున్నాం.

-వీరన్న, వసంత్‌విహార్‌కాలనీ, జహీరాబాద్

ఉన్న సిబ్బందితో ఉత్తమ సేవలందిస్తున్నాం



ప్రస్తుతం అందుబాటులో ఉన్న సిబ్బందితోనే ప్రజలకు ఉత్తమ సేవలందిస్తున్నాం. డ్రైనేజీ కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించడం, రోడ్లను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. పట్టణ శుభ్రతకు తొలి ప్రాధాన్యతనిస్తున్నాం.

-ఉమామహేశ్వరరావు, కమిషనర్-జహీరాబాద్

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

హుస్నాబాద్: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన రిశ్వంత్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. గురువారం సిద్దిపేటలో జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో అండర్ 16 బాలుర విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్, 100 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించాడు. 23న హైదరాబాద్ గార్డియం ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రిశ్వంత్ పాల్గొనన్నుట్లు పీడీ శ్రీనివాస్ తెలిపారు.

లారీ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన రామచంద్రాపురం పట్టణంలోని జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూర్ జిల్లాకు చెందిన సాధు రవితేజ(36) శేరిలింగంపల్లి పరిధిలోని జవహర్ నగర్ కాలనీలో కుటుంబంతో ఉంటున్నాడు. పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని గ్లాండ్ ఫార్మా పరిశ్రమలో పని చేస్తున్నారు. రోజు మాదిరిగానే బైక్‌పై డ్యూటీకి బయలుదేరాడు. లింగంపల్లి నుంచి పటాన్‌చెరు వైపు వెళ్తుండగా రామచంద్రాపురం డీమార్ట్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన రెడీమిక్స్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవితేజ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మంత్రి పొన్నంను కలసిన గాలి అనిల్



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అనిల్

పటాన్‌చెరు: రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గాలిఅనిల్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలసి బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ అసెంబ్లీలో ఆమోదం పొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంత్రిని సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు.

కార్మికులకు న్యాయం చేయాలి

నారాయణఖేడ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సవరణలు చేసి కార్మికులకు వేతన పెంపుతో న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. గురువారం డివిజన్ పరిధిలోని సంఘం ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్ కార్మికులు, ఉద్యోగులకు ఊరటనివ్వలేదన్నారు. కార్మికులకు కనీస వేతనంగా రూ.26 వేలుగా నిర్ణయించాలన్నారు. వేతనాలు పెంచకుంటే చలో హైదరాబాద్ పేరిట ఆందోళన చేపడతామన్నారు. సంఘం డివిజన్ కార్యదర్శి రమేష్, నాయకులు సతీష్, ఎల్లయ్య, శివరాజ్, నర్సింహులు, బాలప్ప, రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.


పది రోజులైనా పరిష్కారం లేదు

కార్పొరేటర్ కుమార్‌యాదవ్

పటాన్‌చెరు టౌన్: దేవస్థానం వద్ద భారీగా పేరుకుపోయిన మట్టి కుప్పలు తొలగించాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి 10 రోజులైనా సమస్య పరిష్కరించలేదని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అసహనం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీలో హనుమాన్ దేవాలయంలో హిందూ నవ యువక్ సేవా సంఘం వారి ఆధ్వర్యంలో ఈ నెల 22న హరి కీర్తన భజన కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో దేవస్థానం వద్ద భారీగా పేరుకుపోయిన మట్టి కుప్పలు తొలగించాలని నిర్వాహకులు తన దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్ తెలియజేశాను. మట్టి కుప్పలను తొలగింపజేయాలని చెప్పి, పది రోజులు గడిచినా స్పందించలేదన్నారు. తిరిగి అడిగితే డిప్యూటీ కమిషనర్ తమ వద్ద నిధులు లేవని తొలగించలేమని చెప్పారని తెలిపారు. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన డిప్యూటి కమిషనర్ నిధులు లేవు అని చెప్పడం సరికాదన్నారు. దేవస్థానానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సొంత నిధులతో పారిశుద్ధ్య పనులు చేయించడం జరిగిందన్నారు. అందులో భాగంగా జేసీబీతో మట్టి కుప్పలు తొలగించినట్లు తెలిపారు.



నర్సాపూర్ రాయరావు చెరువు



నర్సాపూర్ అడవుల గుండా పారుతూ వచ్చే పంది వాగు

ఆహ్లాదం.. ఆందోళనమయం

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ప్రభుత్వం డంప్‌యార్డు ఏర్పాటు చేస్తుండగా దాని నుంచి వచ్చే కలుషితం నర్సాపూర్‌పై తీవ్ర ప్రభావం చూపనుంది. ఇక్కడి వాతావరణం, జలాలు, అడవులు కలుషితమవుతాయన్న భయాందోళనలు అన్ని వర్గాల ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– నర్సాపూర్:

- నర్సాపూర్‌పై గుమ్మడిదల మండలం ప్యారానగర్ డంప్‌యార్డు ప్రభావం
- అడవులు, జలాశయాలు కలుషితం
- వ్యవసాయరంగం, మత్స్యరంగం ఉనికి కోల్పోయే అవకాశం
- దుర్వాసనతో నిండిపోనున్న పరిసర ప్రాంతాలు
- వ్యతిరేకిస్తున్న ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు

హెచ్ఎండీఏ నుంచి రోజుకు రెండు వేల టన్నుల చెత్త సేకరించి ప్యారానగర్ డంప్‌యార్డుకు తెచ్చి రీసైక్లింగ్ చేస్తారని, గ్యాస్ ఉత్పత్తి చేస్తారని ప్రచారం జరుగుతోంది. చెత్త నుంచి ఏమి తయారు చేసినా వచ్చే దుర్వాసనతో ప్యారానగర్‌తోపాటు నర్సాపూర్ అడవులు వాయు కాలుష్యమయంగా మారుతాయి. పచ్చని అడవులు సైతం ఆగమయ్యే అవకాశం ఉంది. నర్సాపూర్‌లోని అర్బన్ పార్కు పర్యాటక పరంగా ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతుంది. దీన్ని మరింత పర్యాటకంగా చేయాలన్న లక్ష్యంతో అధికారులు కోట్ల రూపాయలు వెచ్చించి అందులో కాటేజీలు నిర్మిస్తున్నారు. స్థానిక అడవులు కాలుష్యమైతే అర్బన్‌పార్కును పర్యాటక రంగంగా అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారి పోయే ప్రమాదం ఉంది.

ప్రధాన వనరుతోపాటు చెరువు కలుషితం

ప్యారానగర్‌కు కొద్ది దూరం వరదలు మొదలై పారుతూ వచ్చే వాగును పంది వాగుగా పిలుస్తారు. పంది వాగు నర్సాపూర్ రాయరావు చెరువుకు ప్రధాన వనరుగా కొనసాగుతోంది. సుమారు నాలుగు కిలోమీటర్లు అడవిలో ప్రవహించి నర్సాపూర్ చెరువులో కలుస్తుంది. అటవీ శాఖ పంది వాగుపై రెండు చెక్ డ్యాంలు నిర్మించి నీరు నిల్వ ఉండే విధంగా చర్యలు చేపట్టింది. డంప్‌యార్డు ఏర్పాటు చేస్తే దాని నుంచి వచ్చే జల కాలుష్యంతో పంది వాగు కాలుష్యమయంగా మారుతుంది. ఈ కలుషిత నీటితో అడవిలోని జంతువులు తగ్గిపోయే ప్రమాదం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

గొలుసు చెరువులన్నీ ఆగం

రాయరావు చెరువు కింద మండలంతోపాటు హత్నూర మండలంలోని సుమారు 10 గొలుసు కట్టు చెరువులుంటాయి. రాయరావు చెరువు నిండి అలుగులు పారితే రాంచంద్రాపూర్, మూసాపేట, కాసాల, సికింద్లాపూర్, కొన్యాల్ తదితర చెరువులు నిండుతాయి. చివరకు మంజీరా వాగులో ఈ నీరు కలిసే అవకాశం ఉంటుంది. రాయచెరువు కలుషితమైతే దీంతోపాటు దాని కింద ఉన్న గొలుసు చెరువులన్నీ కలుషితమయ్యే అవకాశం ఉంది. దీని వల్ల ఆ నీళ్లతో సాగయ్యే వ్యవసాయ పొలాలు దెబ్బతింటాయి. అలాగే చెరువుల్లోని చేపలు చనిపోయే అవకాశం ఉంది.

అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత

డంప్‌యార్డును గుమ్మడిదల్ల మండలం ప్యారానగర్, కొత్తపల్లి, నల్లవల్లి, గుమ్మడిదల్ల గ్రామాలతో పాటు నర్సాపూర్ ప్రజలు జేఏసీ కమిటీలుగా ఏర్పడి తీవ్రంగా వ్యతిరేకిస్తూ నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాలలో రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇటీవల అసెంబ్లీలో డంప్‌యార్డు అంశాన్ని ప్రస్తావించి రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పలువురు నర్సాపూర్, గుమ్మడిదల్ల మండలానికి చెందిన జేఏసీ నాయకులను వెంట తీసుకెళ్లి ఢిల్లీలో అటవీశాఖ డైరెక్టర్ జనరల్ సుశీల్‌కుమార్‌ను, కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్రయాదవ్‌లను కలిసి డంప్‌యార్డు అనుమతులను రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రజల డిమాండ్‌కు తలొగ్గి డంప్‌యార్డును రద్దు చేస్తుందా, డంప్‌యార్డును కొనసాగిస్తుందా వేచి చూడాలి.

డంప్‌యార్డును రద్దు చేయాలి



ప్రస్తుతానికి డంప్‌యార్డుపై కోర్టు స్టే ఉంది. డంప్‌యార్డుతో రాబోవు తరాలకు అనేక నష్టాలు సంభవిస్తాయి. వాయు కాలుష్యం జల కాలుష్యంతోపాటు అడవులు పాడయ్యే ప్రమాదం ఉంటుంది. ప్రజల అభీష్టం మేరకు ఇటీవల తాను అసెంబ్లీలో డంప్‌యార్డు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరాను. డంప్‌యార్డుతో అనేక విధాలుగా నష్టాలు ఉంటాయి. డంప్‌యార్డుకు కేటాయించిన భూములను సర్వే చేసి ప్రభుత్వ భూములు ఉంటే పేదలకు పంచాలి.

– సునీతారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే

చెరువులు కలుషితమవుతాయి



ప్యారానగర్ డంప్‌యార్డుతో నర్సాపూర్ అడవులతోపాటు పలు చెరువులు కలుషితమవుతాయి. ప్రశాంతంగా ఉన్న నర్సాపూర్ అడవులు, పట్టణం కలుషితమయంగా మారితే ప్రజలు అస్వస్థతలకు గురవుతారు. చెరువుపై ఆధారపడే వ్యవసాయరంగం, మత్స్యరంగం ఉనికి కోల్పోయే ప్రమాదం ఉంది. తమ వంతుగా ఎంపీ రఘునందన్‌రావు ద్వారా డంప్‌యార్డు రద్దు కోసం తమ వంతు కృషి చేస్తున్నాం అందులో భాగంగా కేంద్ర మంత్రి, కేంద్ర అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేస్తున్నాం.

– మురళీయాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

సీఎం దృష్టికి తీసుకెళ్తాం



డంప్‌యార్డు విషయాన్ని జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ప్రజల అభిష్టాలను వివరించి డంప్‌యార్డు ఇక్కడి నుంచి ఎత్తివేయాలని కోరనున్నాం. గత ప్రభుత్వం ఇచ్చిన అనుమతులతోనే డంప్‌యార్డు ఏర్పాటు చేస్తున్నారే తప్ప తమ ప్రభుత్వ తప్పు ఏ మాత్రం లేదు.

– ఆంజనేయులుగౌడ్, డీసీసీ అధ్యక్షుడు

బోరుబావి తవ్వకంలో వివాదం, ఘర్షణ

అన్న కుటుంబంపై దాడి.. ఐదుగురికి తీవ్ర గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): బోరుబావి తవ్వకంలో చోటుచేసుకున్న వివాదం.. సోదరుల మధ్య ఘర్షణకు కారణమైంది. అన్న కుటుంబంపై తమ్ముడి కుటుంబ సభ్యులు గొడ్డళ్లు, కర్రలతో దాడికి పాల్పడగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధి తిమ్మాపూర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రాచపల్లి బాలయ్య, భిక్షపతి అన్నదమ్ములు. కొంత కాలంగా వీరి ఇద్దరి మధ్య భూ వివాదం కారణంగా గొడవలు జరుగుతున్నాయి. బాలయ్య ఇంట్లో నీటి ఎద్దడి ఉండటంతో బోరుబావి తవ్వించేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. అయితే.. డ్రిల్లింగ్ మిషన్ లారీని భిక్షపతి తన స్థలంలో నుంచి వెళ్లకుండా వ్యూహాత్మకంగా బోరు మోటారు ఆన్‌చేసి నీటిని వదిలాడు. ఆగ్రహించిన బాలయ్య కొడుకు బోరు మోటారుకు సంబంధించిన విద్యుత్ వైరు తొలగించడంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ విషయం హైదరాబాద్‌లో ఉంటున్న తన కొడుకులకు భిక్షపతి సమాచారం అందించాడు. వారొచ్చి అర్ధరాత్రి బాలయ్య ఇంటి తలుపులు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు.గొడ్డళ్లు, కర్రలతో దాడులకు పాల్పడ్డారు. దీంతో బాలయ్య, పూనమ్మ,, నర్సింహులు, అంజమ్మ, యాదగిరి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, దాడికి పాల్పడిన భిక్షపతి, సుశీల, ప్రసాద్, రాజుపై కేసు నమోదు చేశామని, వీరిలో సుశీల మినహా మిగిలిన వారందరినీ అరెస్టు చేశామని ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

యువకుడు అదృశ్యం

సంగారెడ్డి క్రైమ్: ఇంటి నుంచి వెళ్లి యువకుడు అదృశ్యమైన ఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. పట్టణంలోని కిందిబజారుకు చెందిన చింపోలి అరుణ్ (27) నిత్యం మద్యం సేవిస్తుండటంతో తల్లిదండ్రులు మందలించారు. కోపంతో 8న ఇంటి నుంచి వెళ్లి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం అరుణ్ తల్లి భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఆచూకీ తెలిస్తే 87126 61830 నంబర్లకు తెలియజేయాలని సీఐ పేర్కొన్నారు.

దేవుడి దర్శనానికి వెళ్లొస్తుండగా ట్రాక్టర్ బోల్తా

ఇద్దరికి తీవ్ర, మరో 12 మందికి స్వల్ప గాయాలు



పొలంలో బోల్తా పడిన ట్రాక్టర్

దుబ్బాకటౌన్ : ట్రాక్టర్ బోల్తా పడటంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన దుబ్బాక మున్సిపల్ పరిధిలోని రేకులకుంట సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మిరుదొడ్డి మండలం మల్లుపల్లి, రుద్రారం గ్రామానికి చెందిన 20 మంది బంధువులు ట్రాక్టర్‌లో రేకులకుంట మల్లికార్జున స్వామి ఆలయ దర్శనానికి వచ్చారు. గురువారం తెల్లవారు జామున తిరుగు ప్రయాణం కాగా రేకులకుంట సమీపంలోకి రాగానే రోడ్డుపై గుంతను తప్పించబోయే క్రమంలో ట్రాక్టర్ బోల్తా పడింది. ఇందులో మంతూరి కనకయ్యకు పక్కటెముకలు, లక్ష్మీ (70) చేతికి తీవ్ర గాయాలు కాగా, మరో 12 మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటన పై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ గంగరాజు తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యం.. నిండు ప్రాణం బలి



ఆస్పత్రి ఎదుట గాయాలతో బీరయ్య

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు
- డాక్టర్లు లేక గంటపాటు ఆస్పత్రి వద్దే, మరో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

మద్దూరు(హుస్నాబాద్): వైద్యులు అందుబాటులో లేక వ్యక్తి మృతి చెందిన ఘటన లద్నూరు ప్రభుత్వాస్పత్రి వద్ద చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మద్దూరు మండల పరిధిలోని లద్నూర్ గ్రామానికి చెందిన కేమిడి బీరయ్య(65) గురువారం బోరు మోటారు మరమ్మతుల కోసం జనగామకు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో లద్నూరు గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు వెంటనే బీరయ్యను లద్నూరు గ్రామంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కానీ సమయానికి ఆస్పత్రిలో వైద్యులు లేక గంటపాటు అక్కడే ఉన్నారు. అనంతరం 108 ద్వారా చేర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సరైన సమయంలో వైద్యం అందకనే బీరయ్య ప్రాణాలు కోల్పోయాడని గ్రామస్తులు, బంధువులు ఆరోపించారు. మద్దూరు ఉమ్మడి మండలంలోనే 12 పడకలతో 24 గంటలపాటు నడిచే ఏకైక లద్నూరు ఆస్పత్రిలో వైద్యులు నిత్యం ఉండాలి. కానీ సిబ్బంది సక్రమంగా ఉండకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అదుపుతప్పి.. డివైడర్‌ను ఢీకొట్టి


- జహీరాబాద్‌లో జరిగిన కారు ప్రమాదంలో ఒకరు మృతి
- నలుగురికి తీవ్ర గాయాలు



డివైడర్‌ను ఢీకొన్న కారు

జహీరాబాద్: కారు డివైడర్‌ను ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. రంజాన్ పండుగ కోసం మహబూబ్‌నగర్‌కి జిల్లా చెందిన వారు అవసరమైన సామగ్రిని ముంబాయిలో కొనుగోలు చేసుకొని కారులో గురువారం తిరుగు ప్రయాణం అయ్యారు. జహీరాబాద్ పట్టణంలోని బైపాస్ రోడ్డుపై పాత చెక్ పోస్టు వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న ఖాజా ఫరీదుద్దీన్(34) తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మరో నలుగురు అలి ముద్దీన్, నాసిర్, ముదాసిర, రజియుద్దీన్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు జహీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మరో ప్రమాదంలో యువకుడు మృతి మరొకరికి గాయాలు



బాబు మృతదేహం

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. గజ్వేల్ మండలంలోని దిలాల్‌పూర్ గ్రామానికి చెందిన క్యాసారం బాబు(26), అతడి స్నేహితుడు బోనాల యాదగిరి(26) కలిసి గురువారం బైక్‌పై కుకునూరుపల్లి మండలంలోని మేదినీపూర్ గ్రామానికి వెళ్లారు. ఓ వ్యక్తి డబ్బులు ఇచ్చేది ఉండటంతో తీసుకొని తిరుగు ప్రయాణమయ్యారు. కుకునూరుపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్ వద్దకి రాగానే బైక్ అదుపుతప్పి రాజీవ్ రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బాబుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, యాదగిరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు యాదగిరిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి చిన్నాన్న వెంకటయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పెండింగ్ కేసులు త్వరగా డిస్పోజల్ చేయాలి

సిద్దిపేట సీపీ అనురాధ

హుస్నాబాద్ డివిజన్ పోలీసులతో సమీక్ష



మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా డిస్పోజల్ చేయాలని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో హుస్నాబాద్ డివిజన్ పోలీసు అధికారులతో పెండింగ్ కేసులపై సీపీ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదవ తరగతి పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, సీఐలు శ్రీనివాస్, శ్రీను, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విషాదంగా మారిన విహారయాత్ర

- ఆగి ఉన్న ట్రావెల్స్ బస్సును ఢీకొన్న డీసీఎం
- ఇద్దరు మహిళలు మృతి, మరో నలుగురికి గాయాలు
- కోళాపల్లి వద్ద ఘటన



ప్రమాద స్థలంలో డీసీఎం, ట్రావెల్స్ బస్సు

పెద్దశంకరంపేట(మెదక్): ట్రావెల్స్ బస్సును డీసీఎం ఢీకొట్టడంతో ఇద్దరు మహిళలు చెందారు. ఈ ఘటన పెద్దశంకరంపేట మండలం కోళాపల్లి వద్ద 161వ జాతీయ రహదారిపై గురువారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. విజయనగరం జిల్లా చీపురుపల్లి, ఆకులపల్లి, పెనుబర్తి, కోమారం గ్రామాలకు చెందిన 40 మంది యాత్రికులు శ్రీ బాలాజీ టూర్స్ అండ్ ట్రావెల్స్ బస్సులో తొమ్మిది రోజుల కిందట బయలుదేరి యాదగిరి గుట్ట, షిర్డీ, తుల్జాపూర్‌లో దర్శనం చేసుకున్నారు. అనంతరం చిలుకూరు బాలాజీ, శ్రీశైలంకు వెళ్తుండగా కోళాపల్లి వద్ద టిఫిన్ చేద్దామని ఆగారు. ఇదే సమయంలో నిజాంపేట వైపు నుంచి నిద్రమత్తులో వస్తున్న డీసీఎం వాహనం డ్రైవర్ కాల్ భీమ్ అతివేగంగా వచ్చి యాత్రికులను, బస్సును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మీసాల అప్పల నారాయణమ్మ(55) అక్కడికక్కడే మృతి చెందింది. గాయాలైన దేవీప్రియ, పవన్, రవుతూ సూరప్పమ్మ, అప్పల నాయుడు, లక్ష్మిని హైవే సిబ్బంది అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రవుతూ సూరప్పమ్మ మృతి చెందింది. బస్సు డ్రైవర్ రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలను వారి స్వగ్రామానికి తరలించి వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు. డీసీఎం డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

మహిళ మృతదేహం లభ్యం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల పరిధిలోని కొండపోచమ్మ ఆలయం సమీపంలో గురువారం గుర్తు తెలియని మహిళ (యాచకురాలు) మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ చంద్రమోహన్ కథనం మేరకు.. రెండు నెలల కిందట హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి వచ్చి ఆలయం వద్ద చిన్న గుడారంలో నివాసం ఉంటూ భిక్షాటన చేస్తూ జీవిస్తుంది. గురువారం ఆమె చనిపోయినట్లు గ్రా మస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి వయస్సు 60 ఉంటుందని, ఒంటిపై నేవీ బ్లూ కలర్ టీ షర్టు, పర్పుల్ కలర్ లంగా కలదని, ఎవరని ఆరా తీయగా ఎటువంటి వివరాలు లభించలేదని ఎస్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఉపాధి హామీ అక్రమాల్లో రారాజు

- నాగసముద్రాలలో ఫీల్డ్ అసిస్టెంట్ మాయ
- పనుల్లో నిత్యం అవకతవకలు
- పనికి రాకున్నా ఖాతాల్లో డబ్బులు
- ఇదేంటని అడిగిన వారికి పని రద్దు
- రూ.లక్షలు కాజేసినట్లు ఆరోపణలు
- ప్రజావాణిలో గ్రామస్తుల ఫిర్యాదుతో వెలుగులోకి అక్రమాలు



గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి పనులు

కోహెడరూరల్(హుస్నాబాద్) : జాతీయ ఉపాధి హామీ పథకం అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. లేని చెట్లను ఉన్నట్టుగా చూపించి.. వాటిని కూలీలతో సంరక్షిస్తున్నామని రికార్డులు తారుమారు చేసి రూ.వేలల్లో నొక్కేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య.. పని జరగకుండానే జరిగినట్టుగా చెప్పి కూలీకి రాని వారిని వచ్చినట్లు మస్టర్ లో చూపించి ఏటా రూ.లక్షల్లో దోచేయడం అలవాటు. గ్రామంలో లేని వారు.. దూర ప్రాంతాల్లో స్థిరపడ్డ వారు.. కూలీ పనికి రాని వారి పేర్లతో దోపిడీకి పాల్పడ్డాడు కోహెడ మండలం నాగసముద్రాల గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ కొడముంజ రాజు. ఇదేంటని అడిగిన వారికి కూలీ పని లేకుండా చేస్తున్నాడు. దీంతో ఏళ్ల తరబడి ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాల చిట్టా బ్యాంక్ బ్యాలెన్స్‌లా పెరిగిపోతూనే ఉంది.

కూలి పనికి రాకున్నా హాజరు

కోహెడ మండలం నాగసముద్రాల గ్రామానికి చెందిన కొడముంజ రాజు ఎనిమిదేళ్లుగా జాతీయ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. పనుల వివరాలను చూసుకొని కూలీలతో పనులు చేయించి, వారికి హాజరు వేసి బ్యాంక్ లో కూలీ సొమ్ము పడేలా చూడటం అతని విధి. కానీ లేని పనిని ఉన్నట్టుగా చూపడం, బోగస్ మస్టర్‌లు వేయడం, బినామీల పేర్లపై జాబ్ కార్డు సృష్టించి కూలీల సొమ్మును తన వైపు మళ్లించడం చేశాడు. తన దగ్గరి వారు కూలి పనికి రాకున్నా హాజరు వేయడం వచ్చిన సొమ్ములో సగం తీసుకోవడం మొదలు పెట్టాడు. ఇదేంటని ప్రశ్నిస్తే అడిగిన వారికి పని లేకుండా చేస్తున్నాడు. ఇతడి భార్య మాజీ ఎంపీటీసీ ఆమె ఒక్కరోజు పనికి రాకున్నా ప్రతీ నెల వచ్చినట్టు చూపించి రూ.వేలల్లో సొమ్ము కాజేశాడు. కుమారుడి పేరు పై జాబ్ కార్డు సృష్టించి తప్పుడు మస్టర్ రాసి సొమ్ము పక్కదారి పట్టించాడు. తన కింద 5 మంది మేటీలను పెట్టుకొని అక్రమాలు చేస్తున్నాడు. ఇలా రూ.లక్షలు కాజేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

అధికారులకు వాటాలు

ఈ అక్రమాల్లో అధికారులకంటూ వాటా ఉందని, ఏపీఓ, ఎంపీడీఓ కనీసం పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. గ్రామస్తులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఒక్కరోజైన విచారణ చేయలేదు. వారికి వాటాలు అందడంతోనే పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉపాధిలో జరిగిన అక్రమాలపై గత సోమవారం ప్రజావాణిలో గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఫిర్యాదు చేసిన సాయంత్రమే ఈ విషయంపై విచారణ చేయాలని ఏపీఓ, ఎంపీడీఓకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికైనా క్షేత్ర స్థాయిలో విచారణ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదు వాస్తవమే

నాగసముద్రాల గ్రామంలో ఉపాధి హామీలో అక్రమాలు జరిగినట్టు మా దృష్టికి వచ్చింది. ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన దానిపై విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఒకే ఇంట్లో ఇద్దరికి జాబ్ కార్డులు ఉండకూడదు. అలాంటి వాటిని తొలగించి అవినీతి జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– రంగనాయక్, ఏపీఓ, కోహెడ